andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8 కనిష్ఠం 20.5
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 20 సెప్టెంబరు 2024



వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 19: తెలంగాణ వరద బాధితుల కోసం గురువారం జిల్లా కేంద్రంలో తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం మూడు రోజుల పాటు విరాళాలను సేకరించనున్నామని తెలిపారు. సేకరించిన విరాళాలను రాష్ట్ర కమిటీకి అప్పగించి సీఎం సహాయనిధికి చేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శ్యాం, రాజలింగం, శ్రీనివాస్, వడ్ల వెంకన్న, కిషోర్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే.. పరిమితం!



పోచారం ప్రాజెక్టు



నిజాంసాగర్ ప్రాజెక్టు

- జిల్లాలో ప్రధాన ప్రాజెక్టుల ఆధునికీకరణ ప్రశ్నార్థకం
- ప్రాజెక్టుల్లో పూడికతో తగ్గిన నీటి సామర్థ్యం
- వరద వస్తే నిల్వ చేయలేని పరిస్థితి
- నిజాంసాగర్‌లో పేరుకపోయిన పూడిక
- ఈ వర్షకాలంలో 12 టీఎంసీల నీరు దిగువకు విడుదల
- ప్రతిపాదనలకే పోచారం ఎత్తు పెంపు
- ఈ ప్రాజెక్టు నుంచి 8 టీఎంసీల నీరు విడుదల
- ప్రాజెక్టుల ఆధునికీకరణకు నిధులు కేటాయించని ప్రభుత్వాలు
- ప్రజాప్రతినిధులు పట్టించుకుంటేనే ప్రాజెక్టులకు నీరు

కామారెడ్డి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతన్నలకు అండగా నిలుస్తున్న ప్రధాన ప్రాజెక్టుల ఆధునికీకరణ, మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నాయి. జిల్లాలోని నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టుల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రాజెక్టులను ఆధునికీకరించకపోవడం కనీసం మరమ్మతులు చేయకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం ప్రతీ ఏటా తగ్గిపోతోంది. ప్రధానంగా పూడిక పేరుకపోవడంతో ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వస్తే దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రతీ వర్షకాలం సీజన్‌లో ఇదే పరిస్థితి వస్తున్నా ప్రాజెక్టుల మరమ్మతులు మాత్రం జరగడం లేదు. ఈ వర్షకాలం సీజన్‌లో భారీ వర్షాలు కురువడం ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద పోటెత్తి ంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు 12 టీఎంసీలకు పైగా నీటిని విడుదల చేశారు. పోచారం ప్రాజెక్టు జలాశయం నుంచి సుమారు 8 టీఎంసీల వరకు దిగువకు వదిలారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల గేట్లతో పాటు డ్యాం కట్టడాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా ప్రజాప్రతినిధులు పట్టించుకుంటేనే ప్రాజెక్టుల ఆధునిక మరమ్మతులకు అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పూడికతో సామర్థ్యం తగ్గిన నిజాంసాగర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వరద ప్రదాయినిగా పేరొందిన నిజాంసాగర్ ప్రాజెక్టు సామర్థ్యం ప్రతీఏటా తగ్గుతోంది. ప్రాజెక్టులో భారీగా పూడిక పేరుకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా పడిపోయింది. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందుతోంది. 1933లో నిజాంసాగర్ మండలం అచ్చంపేట వద్ద మంజీరా నదిపై 29.70 టీఎంసీలతో ప్రాజెక్టు నిర్మించారు. ఆ సమయంలో ప్రాజెక్టు ఆయకట్టు 2.75లక్షల ఎకరాలు. 1965లో ప్రాజెక్టులో పూడిక పేరుకపోయి నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలకు పడిపోయింది. దీంతో 1974 లో గేట్లు ఎత్తు పెంచడంతో పాటు అదనంగా మరో 20 వరద గేట్లు నిర్మించి 17.08 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా ఆధునికీకరించారు. ప్రస్తుతం పూడిక పేరుకపోయింది. నీటి నిల్వలు 16 టీఎంసీలకు చేరుకోగానే ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇలా ఈ వర్షకాలం సీజన్‌లో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో 16 టీఎంసీలకు చేరుకోగానే 20 రోజుల పాటు నీటిని దిగువకు విడుదల చేశారు. ఇలా ఈ సీజన్‌లో 12 టీఎంసీలకు పైగా నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని మంజీరా నదిలోకి గేట్లు ఎత్తి విడుదల చేశారు. ప్రాజెక్టు ఆధునికీకరణ పూడిక తొలగింపు పనులు చేపట్టడం లేదు. ఎగువ నుంచి వచ్చే వరదను ఒడిసిపట్టేందుకు ప్రాజెక్టు సామర్థ్యం లేకపోవడంతో నీటిని విడుదల చేయాల్సి వస్తుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రతిపాదనకే పరిమితమైన పోచారం ఎత్తు

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు సాగు నీటితో పాటు తాగు నీటిని అందించి అత్యంత పురాతనమైన పోచారం ప్రాజెక్టు ఆధునికీకరణ కాదు కదా కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. ఈ పోచారం ప్రాజెక్టు నిర్మించి 100 ఏళ్లు పూర్తయింది. ఈ ప్రాజెక్టు నుంచి సుమారు 11 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతోంది. వానలు కురిసినా ప్రాజెక్టు నిండినా ఆయకట్టు రెండు పంటలకు నీరందని పరిస్థితి ఎదురవుతోంది. ప్రాజెక్టు ఎత్తు పెంపునకు 8 ఏళ్ల కిందట ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు. ఇంకా కార్యరూపం దాల్చడం లేదు. ఈ సీజన్‌లోనూ ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి భారీగా వరద రావడంతో సుమారు 8 టీఎంసీల వరకు నీరు దిగువకు వృథాగా వెళ్లిపోయాయి. ప్రాజెక్టు ఎత్తు పెంచాలని గతంలో ఎల్లారెడ్డిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమించినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రాజెక్టు డ్యాం ఎత్తు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇక వెనుకబడిన ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గంలో కౌలాస్‌నాలా ప్రాజెక్టు గత కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వచ్చే వరదను ఒడిసి పట్టేందుకు కౌలాస్‌నాలా ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా జుక్కల్, పిట్లం, బిచ్కుంద మండలాలకు సాగునీరు అందుతోంది.

ప్రాజెక్టులను పట్టించుకోని ప్రభుత్వాలు

నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు పోచారం ప్రాజెక్టు గేట్లు, డ్యాంల బలోపేతానికి నిధులు మంజూరు చేయాలంటూ గతంలో జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు జలవనరుల శాఖకు ప్రతిపాదనలను రూపొందించి నివేదించారు. ఇప్పటికీ ఆ ప్రతిపాదనలపై ఎలాంటి స్పందన లేకపోయింది. ప్రతీ సంవత్సరం బడ్జెట్ నిర్వహణకు మాత్రమే నిధులు కేటాయిస్తున్నా అందులోను కోతలు విధిస్తున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడికను తొలగిస్తే ఆయకట్టుకు రెండు సీజన్‌లకు సరిపడా సాగునీరు అందనుంది. పోచారం ప్రాజెక్టు ఎత్తు పెంచితే ఆయకట్టు మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక రైతులు చెబుతున్నారు. ఆయకట్టు ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రాజెక్టుల ఆధునికీకరణ మరమ్మతులకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ధరణి పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 19: ధరణి పెండింగ్ ఫైళ్లను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ధరణి, ఓటరు ఇంటింటి సర్వే, ప్రజావాణి, ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైళ్లను సత్వరమే పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ లేకుండా చూడాలని కోరారు. ఇంటింటి సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 26లోగా 10 శాతం సర్వే పూర్తయ్యే విధంగా అధికారులు చూడాలని అన్నారు. రాష్ట్రస్థాయి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని అన్నారు. జిల్లా స్థాయి ప్రజావాణిలో దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని నాలుగు రోజుల్లో ప్రజావాణి దరఖాస్తులను 100 శాతం పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే భూములను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులతో సీఎంఆర్ఎఫ్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు రంగనాథరావు, ప్రభాకర్, ఏవో మసూర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు సుమలత, స్వప్న, సరళ, ఇందిరా, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

27లోగా డిఫాల్ట్ మిల్లర్లు నగదు లేదా బియ్యం రూపంలో చెల్లించాలి

డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్లు ఈనెల 27లోగా నగదు లేదా బియ్యం రూపంలో చెల్లించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మిల్లర్లను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం 2021-22, 2022-23 ఖరీఫ్ డిఫాల్ట్ రైస్‌మిల్లర్లతో సీఎంఆర్ఎఫ్ పెండింగ్ బకాయిలపై సమావేశం నిర్వహించారు. ఈనెల 27లోపు వడ్డీతో నగదు చెల్లించడానికి అనుమతించబడతారని తెలిపారు. బకాయిలు చెల్లించడంలో విఫలమైతే వారిపై ఆర్ఆర్ చట్టం ప్రయోగిస్తామని డిఫాల్ట్ మిల్లర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.



నేడు నాగన్న బావి ప్రారంభోత్సవం

లింగంపేట, సెప్టెంబరు 19 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని అతి ప్రాచీనమైన నాగన్న బావి, (ఏనుగుల బావి, మెట్ల బావి)గా పిలవబడే బావి పునరుద్ధరణ పనులు గత రెండు సంవత్సరాలుగా కొనసాగాయి. బావి పునరుద్ధరణ పనులు పూర్తి కావడంతో శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ల చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. ప్రారంభోత్సవ పనులను గురువారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్ డీఆర్‌డీవో, శ్రీనివాస్, డీపీవోలు పరిశీలించారు.



కళాశాల ప్రిన్సిపాల్ గది ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

'ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల్లో

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 19: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కళాశాల ప్రిన్సిపాల్ గది వద్ద విద్యార్థి సంఘ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల భూములకు కస్టోడియన్‌గా ఉన్న ప్రిన్సిపాల్ కళాశాల భూముల్లో అక్రమంగా నిర్మాణాలు జరుపుతుంటే పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న సరస్వతీ శిశుమందిర్ పాఠశాల యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎంతో మంది రైతులు తమ పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని పండించే పంటలను విరాళంగా ఇస్తే ప్రస్తుతం కళాశాల భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని తెలిపారు. భూములను కబ్జాలు చేస్తూ నిర్మాణాలు చేపడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సీరియస్‌గా తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ స్పందించకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, వినయ్, భరత్, ఫణి, రాహుల్, ప్రియాంక, స్వాతి పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో రోడ్డుపై కోతుల గుంపు

కోతుల బెడద తీరేదెన్నడో?

- గ్రామాల్లో పెరిగిన వానర సంచారం
- ప్రజలపై విచ్చలవిడిగా దాడులు
- నెలల వ్యధిలో పదుల సంఖ్యలో బాధితులు
- చోద్యం చూస్తున్న మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 19: ఎల్లారెడ్డి మండలంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో అటవీ ప్రాంతం ఉండటం సరైన ఆహార సౌకర్యాలు లేకపోవడంతో అడవిని వదిలి కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయి. దీంతో పొద్దున లేచిన దగ్గర నుంచి సాయంత్రం చీకటి పడే వరకు ఇళ్లు, దుకాణాల్లోకి కోతులు చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళుతుండటంతో పొద్దస్తమానం తలుపులు వేసుకుని ఉండాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో రోజురోజుకూ కోతుల సంతతి బాగా పెరిగిపోతుందని వాహనదారులు, చిన్నారులు వాటి నుంచి తప్పించుకోవడానికి నానా ఆగచాట్లు పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో బాధితులు ఉంటున్నా మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని పేర్కొంటున్నారు.



ఇళ్లపైన సంచరిస్తున్న కోతులు

ఇళ్లు, పొలాలను చిందర వందర చేస్తున్న వానరాలు

కోతులు ఇంటిపై రేకులు, పెంకులు నాశనం చేస్తూ నానా హంగామా చేస్తున్నాయి. ఇంటి ఆవరణలో ఉన్న పండ్ల చెట్లు, కూరగాయలను సైతం వదిలిపెట్టడం లేదు. అంతేగాక మొక్కజొన్న పంటల్లో కోతులు గుంపులుగా తిరుగుతూ పంటల ఆకులు, కాయలు తుంచేస్తుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. కోతుల భారీ నుంచి పంటలను కాపాడుకునేందుకు ఓ వైపు దినసరి కూలీలను పంట పొలాల వద్ద కాపాలా ఉంచడమో లేదా వివిధ వేషధారణలతో ఉన్న వస్త్రాలను, దిష్టిబొమ్మలను కొనుగోలు చేసి పంట పొలాల్లో పెడుతూ కోతులను సాగనంపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్ని చేసినా రైతులకు మాత్రం కోతుల బెడద తీరకపోవడంతో వాటిని పట్టి దూర ప్రాంతాలకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

ఖాళీ ఇళ్లే నివాసాలుగా..

కోతుల ఆహారశాల అంటూ ఏర్పాటు చేసినా మొక్కల పెంపకంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో చెట్లు అంతంత మాత్రంగానే పెరిగాయి. దీంతో వాటికి తినేందుకు ఆహారం దొరకక మళ్లీ గ్రామాలపై పడుతున్నాయి. గ్రామాల్లోని భారీ వృక్షాలు, ఎవరూ నివసించకుండా ఖాళీగా ఉండే ఇళ్లను వాటి ఆవాస కేంద్రాలుగా ఏర్పాటు చేసుకుని సంచరిస్తున్నాయి. రాత్రంతా భారీ వృక్షాలపై లేదంటే ఖాళీగా ఉన్న ఇళ్లలో ఉండి తెల్లవారితే ఆహారం కోసం ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో ఉన్న సామగ్రిని చిందరవందరగా చేయడం, ఆహార పదార్థాలు ఎత్తుకుని పోవడంతో పాటు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఖాళీగా ఉండే ఇళ్లను వాటి ఆవాస కేంద్రాలుగా ఏర్పాటు చేసుకుని సంచరిస్తున్నాయి. రాత్రంతా భారీ వృక్షాలపై లేదంటే ఖాళీగా ఉన్న ఇళ్లలో ఉండి తెల్లవారితే ఆహారం కోసం ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో ఉన్న సామగ్రిని చిందరవందరగా చేయడం, ఆహార పదార్థాలు ఎత్తుకుని పోవడంతో పాటు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఇంట్లో నుంచి ఎవరిని బయటకు రాకుండా చేస్తున్నాయి. రహదారులపై కూరగాయలు, సరుకులు, తదితర సామగ్రి తీసుకుని వెళుతున్న పాదాచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తుండటంతో వారు సైతం గాయపడుతున్నారు.

వార్డుల వారీగా ఓటరు లిస్టు సరిచేసుకోవాలి

సదాశివనగర్, సెప్టెంబరు 19: గ్రామాల్లోని వార్డుల వారీగా ఓటరు లిస్టు సరిచేసుకోవడానికి ఈనెల 21లోపు గడువు ఉందని ఎంపీవడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. ఓటరు లిస్టులో చేర్పులు, మార్పులపై గురువారం మండల కేంద్రంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. తప్పొప్పులను సరిచేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఈనెల 26, 27న జిల్లా స్థాయి సైన్స్ మేళా యువజనోత్సవాల పోటీలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19: ఈనెల 26, 27వ తేదీన జిల్లా స్థాయి సైన్స్ మేళా యువజనోత్సవ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సంవత్సరం జనవరి 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ యువజనోత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగానే జిల్లా స్థాయి పోటీలు ఈనెల 26న సైన్స్ మేళా, 27న యువజనోత్సవాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైన్స్ మేళా 26న నగరంలోని మానిక్‌భవన్ స్కూల్‌లో ఉదయం 9గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. వయస్సు 15-29 సంవత్సరాల యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు, యువకులు జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ 9848219365 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. జిల్లాస్థాయి యువజన పోటీలు 27వ తేదీన నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉదయం 9గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జానపద నృత్యం బృందం, జానపద నృత్యం వ్యక్తిగత, జానపద గీతాలు బృందం, జానపద గీతాలు వ్యక్తిగతం, కథారచన, కవిత్వం, పెయింటింగ్, వక్తృత్వ పోటీలు, యువకృతి విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే యువతీ యువకులు 15-29 సంవత్సరాలలోపు కలిగి ఉండాలన్నారు. మూడు సంవత్సరాలలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవంలో పాల్గొన్న యువతీ యువకులు, బృందం సభ్యులు ఈ పోటీలకు అనర్హులని అన్నారు. జిల్లాస్థాయి పోటీలో ప్రథమ స్థానం సాధించిన యువతీ యువకులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో స్థానం సంపాదించిన యువతీ యువకులను జనవరి 1 నుంచి 16 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ పోటీలో పాల్గొనే కళాకారులు ఈనెల 24లోపు ఆన్‌లైన్‌లో, 9701177144, 9959649574 వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పాల్గొనే యువతీ యువకులు రెండు కలర్ ఫొటోలు, ఆధార్‌కార్డు, పుట్టినతేదీ ధ్రువపత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు.

జీవన భృతి పెంచకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం

● సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ధర్పల్లి, సెప్టెంబరు 19: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికుల జీవనభృతి రూ.2016 నుంచి రూ.4016కు పెంచకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని బీడీ కార్మికులకు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 9 నెలలు గడుస్తున్నా ఇంతవరకు కార్మికుల జీవనభృతి పెంచలేదని విమర్శించారు. పెన్షన్ అమలు విషయంలో యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం వలన జీవనభృతి సాధించుకున్నామని అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జీవనభృతి పెంచేవరకు ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. వెంటనే బీడీ కార్మికులకు పెంచిన జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేష్, దామోదర్, ఈ. రమేష్, అనిల్, కిశోర్, ఆశీష్, లలిత, పద్మ, లక్ష్మి, రాజు, నస్రీన్‌బేగం, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో దొంగతనం

● రెండు తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాల చోరీ

మోపాల్, సెప్టెంబరు 19: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన సాయిలు ఇంటి తాళాలు పగలగొట్టి రెండు తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఏఎస్సై రమేష్ తెలిపారు. సాయిలు ఇంటికి తాళం వేసి తన బంధువుల ఇంటికి వెళ్లారని దీంతో దుండగులు బుధవారం దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. చుట్టుపక్కల వారు చూసి ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఇంటి యజమాని హుటాహుటిన స్వగ్రామానికి వచ్చి ఇంట్లో చూడగా రెండు తులాల బంగారం, 10 తులాల వెండి చోరీకి గురైనట్లుగా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన వీడీసీ సభ్యులు

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 19: మండలంలో ఈనెల 23న జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి రావాలని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని గురువారం జక్రాన్‌పల్లి వీడీసీ సభ్యులు, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆహ్వానించారు. నిజామాబాద్‌లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి జక్రాన్‌పల్లి వీడీసీసభ్యులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కలిశారు. జక్రాన్‌పల్లిలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవంతో పాటు డబుల్ రోడ్డు ప్రారంభోత్సవం, పాఠశాలలో మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడా ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యేను వారు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జక్రాన్‌పల్లి వీడీసీ సభ్యులు, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెరపురుగు నివారణపై అవగాహన

తాడ్వాయి,సెప్టెంబరు 19: కత్తెర పురుగు నివారణపై రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ కళాశాలలో చదువుతున్న బీఎస్సీ విద్యార్థులు గురువారం ఎర్రపహాడ్ గ్రామంలో అవగాహన కల్పించారు. కత్తెర పురుగు నివారణ పంట నష్టాలపై రైతులకు తగు సూచనలు సలహాలను అందించారు. అనంతరం సోయాపంటలో పంట తెగుళ్ల నివారణకు కిట్లులను రైతులకు అందజేశారు. ఇందులో విద్యార్థులు ప్రణీత, శాంతి, యశ్విత, రైతులు గంగారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మా గోడు పట్టించుకోండి'

సదాశివనగర్, సెప్టెంబరు 19: సదాశివనగర్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలుగా పనిచేసిన అశోక్, ఆయన భార్య సుజాత గత ప్రభుత్వంలో ప్రమోషన్‌తో పాటు ఇతర విభాగాలల్లో సర్దుబాటు చేయడంతో వారు వేర్వేరు ప్రాంతాలకు కేటాయించబడ్డారు. అయితే సుజాతకు ఒక కాలు, ఒక చేయి పనిచేయక అంగవైకల్యంతో సతమవుతూ ఉద్యోగం చేస్తుండగా.. అశోక్ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇద్దరు ఆడ పిల్లలు చిన్నగా ఉండడంతో వారి ఆలనపాలన చూసుకోవడానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని, తమను కామారెడ్డి జిల్లాకు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్‌కు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు విన్నవించామని బాధితులు తెలిపారు. అయినా తమకు ఎక్కడా న్యాయం జరగడం లేదని గురువారం మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతి పత్రం అందించామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమకు తగిన న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఎడపల్లి, సెప్టెంబర్ 19: ఎడపల్లి మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన పల్లికొండ శంకర్ అనే యువకుడు తన ఇంటినుండి పని నిమిత్తం టీవీఎస్ ద్విచక్ర వాహనంపై వస్తూ కొత్త బస్టాండు వద్ద బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్తున్న టీఎస్ 16 యూఏ 0745 నంబరు గల టాటా ఏస్ వాహనం ఢీ కొనడంతో పల్లికొండ శంకర్ కొద్ది దూరం ఎగిరి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని వెంటనే నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

రహదారులే మొక్కజొన్న పంట కల్లాలు

● ప్రధానరహదారులపై మొక్కజొన్న పంట ఆరబోత
● వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ● పట్టించుకోని ఆర్అండ్బీ



వేల్పూర్ నుంచి సాహెబ్పేట్ వరకు వెళ్లే రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న పంట

వేల్పూర్, సెప్టెంబరు19: జిల్లాలో ప్రభుత్వ కల్లాలు కానరాకపోవడంతో రైతులు తమ పంటలను రోడ్లపైనే ఆరబోస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట చేతికి రావడంతో రైతులు మొక్కజొన్న పంట ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రోడ్డును వాడుకుంటున్నారు. వేల్పూర్ మండలంలో పలు గ్రామాలలో ఎక్కడ చూసిన ప్రధానరహదారులు కల్లాలను తలపిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో వాహన దారులు ఆరబోసిన పంట ధాన్యాన్ని గమనించకపోవడంతో వాటిపై వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలో వివిధ గ్రామాల రైతులు మొక్కజొన్న పంట ధాన్యాన్ని ప్రధానరహదారులతో పాటు గ్రామాల మధ్య ఉన్న రహదారులపై ఎండబెడుతున్నారు. మండలంలోని 63వ జాతీయరహదారి పడిగెల ఒడ్డెరకాలనీ క్రాస్ రోడ్డు నుంచి పడిగెల మీదుగా వన్నెల్(బి) వరకు, గోవింద్పేట్ నుంచి జాన్కంపేట్, పచ్చలనడ్కుడ శివారు వరకు సాహెబ్పేట్, జాన్కంపేట్, వేల్పూర్, సాహెబ్పేట, మోతె, అక్లూర్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మొక్కజొన్న పంట ధాన్యాన్ని ఆరబోశారు. దీంతో రోడ్లపై వెళ్తున్న ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోయి గాయాలపాలైన సంఘటనలు పలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలకు అనవాలుగా మారిన మొక్కజొన్న పంట ధాన్యం ఆరబెట్టిన రోడ్లపై కల్లాలను తొలగించే విధంగా ఆర్అండ్బీ అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

కాలువలో పడి ఒకరి మృతి

కోటగిరి,సెప్టెంబరు 19: కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామానికి వెళ్లే దారిలో కాలువలో పడి సాయిరాం(40)అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.ఎత్తొండ గ్రామానికి చెందిన విజయకు బాన్సువాడ గ్రామానికి చెందిన సాయిరాంకు వివాహం జరిగింది.వీరి దాంపత్య జీవితంలో తరుచు గొడవలు జరుగుతుండడంతో విజయ పుట్టింటికి వచ్చింది.సాయిరాం ఎత్తొండకు వస్తున్నానని భార్యకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సాయిరాం అతిగా మద్యంసేవించి ఎత్తొండ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా కాలువలో పడి ఊపిరాడక మృతి చెందాడు.స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈపీఎఫ్ కనీస పెన్షన్ను రూ. 5వేలకు పెంచాలి

పెద్దబజార్, సెప్టెంబరు 19: ఈపిఎఫ్ కనీస పెన్షన్ను ఐదువేలకు తగ్గకుండా పెంచాలని బిఎంఎస్ ఆధ్వర్యంలో ఈపిఎఫ్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న కనీస పెన్షన్ వెయ్యి రూపాయల వల్ల కార్మికులకు ఉపయోగం లేదని బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీడీ కార్మిక సంఘటన కార్యదర్శి పెద్ది శివయ్య, జిల్లా అధ్యక్షుడు దామోదర్, రాష్ట్ర కోశాధికారి కంది కొండల్రెడ్డి, సత్యం తల్వార్లు పాల్గొన్నారు.

పోచారంలో ఉరేసుకుని మహిళ మృతి

ఎడపల్లి, సెప్టెంబరు 19: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పోచారం గ్రామానికి చెందిన ఒడ్డేటి పూజిత (33) తన భర్త చనిపోయినప్పటి నుండి ఆర్థిక పరిస్థితులు బాగా లేక కుటుంబ పోషణ భారమై తనకున్న ఒక్కగానొక్క కుమారుడిని వర్ని మండలం జాకోరా గ్రామంలో నివాసం ఉంటున్న మృతురాలి అక్క ఎడిగే గిరిమవ్వ దగ్గర చదివిస్తూ తను ఒంటరిగా ఉండడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అక్క గిరిమవ్వ వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వర్ని, ఎడపల్లి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వేదికల ఏర్పాటు

రుద్రూరు, సెప్టెంబరు 19 : వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి గాను విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలను ఏర్పాటు చేయడం జరుగుతుందని సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ నారాయణ పేర్కొన్నారు. గురువారం రుద్రూరు మండల కేంద్రం లోని వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రుద్రూరు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ ఏఈలు, కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ బిల్లుల పరిష్కారం కోసం వేదికలకు రావడం జరిగిందన్నారు. దీంతో ట్రాన్స్ ఫార్మర్ల వోల్టేజీ పెంచి బిగించే ఆస్కారం ఉంద న్నారు. రైతులు ఈ విష యంలో అశ్రద్ధ చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో మెంబర్లు ఎస్.రామకృష్ణ, ఎల్.కిషన్రావు, ఎం.రాజాగౌడ్, డీఈ ముక్తర్,ఏడీ, ఏఈలు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

'రైతులను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్ నాయకులు'

డొంకేశ్వర్, సెప్టెంబరు19: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రైతులకు రుణమాఫీ చేయకుండా విస్మరించి అప్పుడు బీఆరెస్ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారని డీసీసీ వైస్ప్రెసిడెంట్ దేగాం గంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. అప్పుడు రైతులను ఏ మాత్రం పట్టించుకోకుండా మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల మీద ఉన్న చిత్తశుద్ధితోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంట రుణాలను మాఫీ చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం ఇంత చేసిన జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు రైతులను మాయమాటలు చెప్పి ధర్నాలకు దింపుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మే పరిస్థితిలో రైతులు లేరని అన్నారు.

మంజీర నదిలో ఇసుక క్వారీల పరిశీలన

కోటగిరి,సెప్టెంబరు 19: పొతంగల్ మండలంలోని కారేగాం, సుంకిని మంజీర నదులలో గురువారం ఇసుక క్వారీల నిర్వహణకు మైనింగ్ ఏడీ విజయ్ కుమార్ రాథోడ్ పరిశీలించారు. గతంలో ఇసుక క్వారీల నిర్వహణకు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ అవసరాలకు ఇసుక అవసరం ఉండడంతో క్వారీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మైనింగ్ ఏడీ తెలిపారు. ఇసుక మేటలను పరిశీలించి ఏ మేరకు ఇసుక లభిస్తుందో వివరాలు సేకరిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట అధికారులు నిఖత్ నాజ్, నాగేష్, శివరాజ్, ఆర్ఐ సాయిలు తదితరులున్నారు.

బోధన్రూరల్: సాలూర మండలంలోని మందర్నా, కొప్పర్గ, సిద్దాపూర్ మంజీర నది సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న గ్రామాలలో ఇసుక క్వారీల ఏర్పాటుకు గురువారం అధికారులు పర్యవేక్షించారు. సరిహద్దులో గల మంజీర పరివాహక ప్రాంతాల్లో ఇసుక క్వారీల కోసం జిల్లా భూగర్భ జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులు మంజీర సరిహద్దు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. ఇసుక మేటలను పరిశీలించి ఏ మేరకు ఇసుక లభిస్తుందో వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయ్ కుమార్ రాథోడ్, నిఖత్ నాజ్, టెక్నిల్ అసిస్టెంట్ నాగేష్, శివరాజ్, ఆర్ఐ గంగాధర్ పాల్గొన్నారు.

మోర్తాడ్లో సభ్యత్వ నమోదు

మోర్తాడ్, సెప్టెంబరు19: మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమో దు కార్యక్రమాన్ని గురువారం మండల బీజేపీ అధ్యక్షుడు పుప్పాల నరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 8800002024 నెంబర్కు మిస్కాల్ ఇచ్చి బీజేపీ కార్యకర్త అందించే సభ్యత్వ ఫారంలో వివరాలు నింపి బీజేపీలో సభ్యులుగా చేరారు. ఈ బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ద్వారా సభ్యత్వ నమోదు పొందవచ్చునని, నమో యాప్ ద్వారా సభ్యత్వం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పుప్పాల నరేష్, జైడి గంగారెడ్డి, ప్రశాంత్, బోగ దేవేందర్, లింగాల రాముగౌడ్, మురళీగౌడ్, మోహన్, శ్రీనివాస్, హరిష్, తదితరులు పాల్గొన్నారు.

భీమ్గల్రూరల్: భీమ్గల్ మండలంలోని బడాభీమ్గల్, ముచ్కూర్ గ్రామాలలో బీజేపీ సభ్యత్వ నమోదును గురువారం బీజేపీ నాయకులు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ సభ్యత్వ నమోదు చేస్తున్నామని, కిసాన్మోర్చ మండల అధ్యక్షుడు మండల ఎన్నికల కన్వీనర్ రవీందర్ తెలిపారు. దేశభద్రత ప్రధాని నరేంద్ర మోదీ ద్వారానే సాధ్యమవుతుందని ప్రతీఒక్కరు పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్మోర్చ మండల అధ్యక్షుడు తోట గంగాధర్, ఆయా గ్రామాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'షబ్బీర్పై అర్బన్ ఎమ్మెల్యే విమర్శలు మానుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 19: ప్రభుత్వ సలహాదారు హోదాలో షబ్బీర్ అలీ రాష్ట్రంలో ఎక్కడైనా పర్యటించే అవకాశం ఉందని, ఇటీవల నగరంలో ఆయన పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించడాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ విమర్శించడం సరికాదని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తిగోపిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో అర్బన్ నుంచి పోటీ చేసి కేవలం 13 రోజుల్లోనే 60వేలకు పైగా ఓట్లు సాధించి ప్రజల అభిమానాన్ని చూరగొన్న షబ్బీర్ అలీ ప్రభుత్వ సలహాదారు హోదాలో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అది చూసి ఓర్వలేక అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ ఆయనపై చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని మరోసారి ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. షబ్బీర్ అలీ నగర అభివృద్ధి గురించి అహర్నిషలు పాటుపడుతున్నారని సీఎంతో మాట్లాడి నగరంతో పాటు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్గ్రేడ్ చేయించారని అదే విధంగా పాత కలెక్టరేట్ స్థలాన్ని గత ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని చూసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి త్వరలో భూమిపూజ చేయడం జరుగుతుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ఇంజనీరింగ్ కళాశాలగా అప్గ్రేడ్ కావడం ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య సహకారం అవుతుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలపై నగరంలో అనేక డ్రైనేజీలు పాడైయ్యాయని అలాగే నాళాలను డ్రైనేజీలుగా నిర్మించేందుకు 10 కోట్లు నిజామాబాద్ నగరానికి మంజూరు చేయించారన్నారు. నాళాలో కొట్టుకు పోయిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా 4లక్షల ఆర్థిక సహాయం అందించేలా షబ్బీర్ అలీ కృషి చేస్తున్నారని అన్నారు. అమృత్ పథకం కింద నగరానికి మరిన్ని వాటర్ ట్యాంకులు, అదే విధంగా అండర్గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి మరిన్ని నిధులు తీసుకువస్తున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధిలో పిసిసి అధ్యక్షుడు మహేష్కుమార్గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్రెడ్డిలు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. బిజెపి ఎమ్మెల్యే అతని అనుచరులు షబ్బీర్ అలీపై అవాక్కులు, చెవాక్కులు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ప్రీతం, సంతోష్, సుభాష్జాదవ్, నరేందర్గౌడ్, కేశమహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

పెర్కిట్, సెప్టెంబరు19: ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రెండు పంటలకు కలిపి రూ.15వేలు రైతు భరోసా ఇవ్వాలని ఆర్మూర్ తహసీల్దార్ కె.గజానన్కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్య పరిరక్షణ అని చెప్పింది. అధికారం వచ్చి తొమ్మిది మాసాలు గడిచిపోతున్న ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేనది, వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మళ్లీ వేలాది మంది రైతులు ఒక్కటై ఉద్యమాలు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బి.దేవరాం, దేగాం యాదాగౌడ్, శ్రీనివాస్రెడ్డి, ఏపీ గంగారాం, యు.రాజన్న, అల్లూరి గంగారెడ్డి, నక్కల రాములు, సురేష్, విజయ్, అంకాపూర్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎటువంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతు ఖాతాలో వెంటనే జమ చేయాలని నక్క భీమేష్ అన్నారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం డొంకేశ్వర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు బైటాయించి ధర్నా నిర్వహించారు. రైతులు పండించిన పంటలకు రూ..500బోనస్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ షైమద్హుస్సెకు వినతిపత్రం అందజేవారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఏకకాలంలో షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రెండు పంటకు రూ.15వేలు వెంటనే అమలు చేయాలని అఖిలపక్షాల రైతు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వేల్పూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి సెప్టెంబర్ 15తేదీ పూర్తయినప్పటికీ రుణమాఫీ చేయకపోవడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొల్ల రమేష్, రవిపటేల్, జైడి నాగాధర్రెడ్డి, రేగుల్ల రాములు, నోముల రవీంధర్రెడ్డి, బబ్బురి ప్రతాప్రెడ్డి, రాజరావు, రాజన్న, జైడి నర్సారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మండల రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా, వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రజలకు వాగ్దానం చేసి ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ దుగ్గెన రాజేందర్, బీజేపీ నాయకులు పుప్పాల నరేష్, జైడి గంగారెడ్డి, మురళీగౌడ్, రైతులు పాల్గొన్నారు.



ఆర్మూర్లో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

జక్రాన్పల్లి: షరతులు లేకుండా రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం జక్రాన్పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కిరణ్మాయికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్, బీజేపీ అధ్యక్షులు బోజన్న, శ్రీనివాస్గౌడ్, డీకొండ శ్రీనివాస్, పిప్పెర గంగాధర్, అరుణ్కుమార్రైతుఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వాగ్దానం మేరకు ఏకకాలంలో షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రెండు పంటకు రూ.15వేలు వెంటనే అమలు చేయాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు లింగారెడ్డి, వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆలూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు జేఏసీ సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు నలిమెల మోహన్రెడ్డి, నాయకులు విజయభారతిరెడ్డి, మోతె చిన్నారెడ్డి, కల్లెం మోహన్, మధు, ప్రభాకర్, రాజు, రైతులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో 21లోపు మార్పులు, చేర్పులు



వేల్పూర్లో ఓటరు జాబితాపై నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో

వేల్పూర్, సెప్టెంబరు19: ఓటరు జాబితాలో ఈనెల 21తేదీలోగా మార్పు లు, చేర్పులు చేసుకోవాలని వేల్పూర్ మండల అభివృద్ధి అధికారి బాలకిషన్ అన్నారు. గురువారం వేల్పూర్ ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఓటరు జాబితాపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులతో ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్టులో వార్డుల మార్పుకు, పేరు నమోదు, తప్పుఒప్పుల సవరణకు ఈనెల 21లోగా పూర్తి చేసుకునేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డితో పాటు వివిధ రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్పల్లి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఓటరు జాబిత సవరణలో భాగంగా గురువారం జక్రాన్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సతీష్కుమార్ వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితపై అవగాహన కల్పించారు. అనంతరం అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయల్లో ఓటరు జాబితాను అతికించారు. ఓటరు లిస్టులో పేర్లు లేకున్నా, ఫోటోలు, ఇతర తప్పులు ఉంటే పంచాయతీలకు వచ్చి సరిచేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్పల్లి: వార్డులవారిగా సవరించిన ఓటరు జాబితాలో ఫోటోలు సరిచూసుకుని మార్పులు, చేర్పులు ఈనెల 21 వ తేదీలోగా చేసుకోవాలని కమ్మర్పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో ఊర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఓటరు జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్,బిఆర్ఎస్, బీజేపీ పార్టీల మండల అధ్యక్షులు సుంకెట రవి, రేగుంట దేవేందర్, కట్ట సంజీవ్, సీపీఐఎంఎల్ మాస్లైన్ ప్రజాపంథ నాయకులు తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 13న ప్రచురించబడిన ముసాయిదా ఓటరు జాబితాలపై ఈనెల 21 వరకు అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే గ్రామ పంచాయితీ కార్యదర్శులకు దరఖాస్తు సమర్పించవచ్చని ఎంపీడీవో సురేష్బాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి ఎంపీవో, ఆయా పార్టీల రాజకీయ నాయకులు తోట అరుణ్కుమార్, నడిపింటి నగేష్, అలపాటి హరికృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని ఎంపిడీవో కార్యాలయంలో గురువారం మండలంలోని పలు రాజకీయ నాయకులతో కలిసి ఓటరు జాబితాకు సంబంధించి ఎంపిడీవో వెంకటేశ్వర్లు సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బిఆర్ఎస్ నాయకుడు బద్ధం శ్రీనివాస్ రెడ్డి, బిజేపి నాయకుడు పాల్గొన్నారు.

బోధన్రూరల్: బోధన్ మండలంలోని వార్డుల వారిగా విభజన చేసిన ఓటరు జాబితాపై గురువారం బోధన్ ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా తుది నిర్ణయం కోసం సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్ కుమార్, బండారుపల్లి గణేష్, బీజేపీ పార్టీ గంగాధర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్పై అవగాహన

ఆర్మూర్టౌన్, సెప్టెంబరు19: మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ అధికారులు పలు షాపుల్లో ప్లాస్టిక్పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేదించాలని దుకాణ యాజమానులకు తెలిపారు. గురువారం పట్టణంలోని గూండ్ల చెరువు వద్ద గణపతి నిమజ్జనం సందర్భంగా చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణ మౌళి, మున్సిపల్ సిబ్బంది ప్రశాంత్, అక్షయ్, తదిత రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

ముప్కాల్, సెప్టెంబరు19: ముప్కాల్ శివారు జాతీయరహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బొల్లి సన్నీ(19) మృతి చెందినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ముప్కాల్కు చెందిన బొల్లి సన్నీ, అతని ఫ్రెండ్స్ అన్నెపాక గోపి, చెన్నూర్ రవీందర్లు అర్ధరాత్రి భారత్ పంపుకి పెట్రోల్ కోసం వెళ్ళి తిరిగి వస్తుండగా లక్ష్మీకెనాల్ బ్రిడ్జి వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న గోపి వెనుక కూర్చున్న బొల్లి సన్నీ తలకు, రవీంధర్కు నడుము బాగంలో తీవ్ర గాయాలు కాగా 108వాహనంలో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సన్నీ మృతి చెందినట్టు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

భీమ్గల్, సెప్టెంబరు19: గర్భిణులు ప్రసవ సమయంలో బిడ్డకు ఐదేళ్ళ వరకు పౌష్టికాహారం తీసుకోవాలని డీడబ్ల్యువో రసూల్బీ తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఎల్జె ఫంక్షన్హాల్లో సీడీపీవో స్వర్ణలత అధ్యర్యంలో పోషణ మాస వారోత్సవాల నిర్వహించారు. ఈ సందర్భంగా డిడబ్ల్యువో రసూల్బీ మాట్లాడుతూ చిన్న పిల్లలు రక్తహీనతతో బాధపడుకూడదని, ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందజేస్తుందని, బిడ్డ పుట్టిన ఐదేళ్ల వరకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికా హారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్హెచ్వో రమేష్, సీడీపీవో స్వర్ణలత, డాక్టర్ అజయ్పవర్, ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్వైజర్ శ్రీదేవి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జెండా బాలాజీ మందిర్ హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 19: పదిహేను రోజుల పాటు ఎంతో వైభవోపేతంగా జరిగిన జెండా బాలాజీ మందిర్ క్షేత్ర హుండీని గురువారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపులో రూ.5లక్షల 34వేల 840 ఆదాయం వచ్చింది. ఆదాయంలో 4లక్షల 90వేల 790 నోట్ల రూపంలో రాగా, 44వేల 50 రూపాయలు నాణెల రూపంలో ఆదాయం చేకూరింది. భక్తులు స్వామివారికి 5 గ్రాముల 800 మిల్లీ గ్రాముల బంగారం, 670 గ్రాముల మిశ్రమ వెండి, తాయ్లాండ్ విదేశీ కరెన్సీ బాత్ 20 వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జాలిగం గోపాల్, కార్య నిర్వహణ అధికారి వేణు, ధర్మకర్తలు రామాగౌడ్, రాజేశ్వర్, విజయ, నర్సింగ్ రావు, నాగభూషణం, సంతోష్, ఆలయ అర్చకులు వెలగలేటి నాగరాజచార్య, ఆలయ జూనియర్ అసిస్టెంట్లు ప్రశాంత్కుమార్, ఆంజనేయులు, రఘునాథ్ కులకర్ని, కిశోర్, విష్ణు సహస్రనామ పారాయణ భక్తులు పాల్గొన్నారు.

భీమ్గల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

భీమ్గల్, సెప్టెంబరు19: ఈనెల 29, 30, అక్టోబర్ 1తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో స్వామి తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులతో ఎంఈవో సమావేశం నిర్వహించారు. క్రీడా పోటీలను పట్టణ కేంద్రంలోని కృషి హైస్కూల్ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్టు ఎంఈవో స్వామి తెలిపారు.

చెరువులు, కుంటలను రక్షించాలి

● తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు



కలెక్టర్కు వినతి పత్రం అందజేస్తున్న అఖిల పక్ష నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 19: జిల్లాలోని చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి రక్షించాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ బి.కేశవులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం అఖిలపక్షం తరపున ఆయన జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కేశవులు మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలోని పులాంగ్ వాగు గాయత్రినగర్ నుంచి ముబారక్నగర్ వరకు అక్రమ నిర్మాణాలు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వ పార్కులతో పాటు, నగర శివారులోని నిజామాబాద్ - బోధన్ రహదారి పక్కనే రామర్తి చెరువు శిఖం భూమి కొంతకాలంగా కబ్జాకు గురవుతూ ప్రస్తుతం సగం కూడా లేదన్నారు. ఇళ్లు కట్టుకున్న వారి కోసం శిఖం ప్రాంతంలో స్తంభాలు ఏర్పాటు చేసి మరీ అధికారులు విద్యుత్ మీటర్లు ఇచ్చారని తెలిపారు. కబ్జా చేసిన వారిపై చర్యల జోలికి పోకుండా మిగిలిన ప్రాంతానికి ఫెన్సింగ్ చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. నాగారంలోని బొందెం చెరువు ఆక్రమణలపైనా అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారని తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ -కోటార్మూర్ గ్రామాల చెరువులకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని అందించిన మైనర్ కాలువతో పాటు బోధన్ ప్రాంతంలోని చెక్కి చెరువు కబ్జాకు గురైనట్లు తమ సర్వేలో గుర్తించామని కేశవులు వివరించారు. భీమ్గల్లో దాదాపు 37 ఎకరాల విస్తీర్ణంలోని రథం చెరువు శిఖం ప్రాంతం 10ఎకరాలకు మించి ఆక్రమణలను గురైందన్నారు. సీఎం రేవంత్రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైడ్రా తరహాలోనే జిల్లాల్లో కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లోని గుట్టల కబ్జాలను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేశవులు కోరారు. కలెక్టర్ను కలిసిన వారిలో సీపీఎం రాష్ట్ర నాయకులు వెంకట్రాములు, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు దండివెంకట్, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ప్రజా సంఘాల నాయకులు తూటికూర నర్సయ్య, అబ్బగోని అశోక్ పాల్గొన్నారు.

పీడీఎస్యూ వాల్పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్టౌన్, సెప్టెంబరు19: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో గురువారం పీడీఎస్యూ వాల్పోస్టర్లను ఆవిష్కరించారు. 1972లో జార్జిరెడ్డి విద్యార్థి నాయకుడిగా ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రం విద్యార్థి హక్కుల కోసం ర్యాగింగ్కు వ్యతిరేకంగా సమసమాజ స్థాపనక కోసం పీడీఎస్యూ స్థాపించారని గుర్తు చేసుకున్నారు. పీడీఎస్యు 50వసం తల వార్షికోత్సవం సభను విజయవంతం చేయాలని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎంఎల్ మాస్లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, బీడీవర్కర్స్ యూ నియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ముత్తెన్న, పీడీఎస్యు జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్, అసి స్టెంట్ ప్రొఫెసర్ శ్యామ్, గంగాధర్, అనిల్, నిఖిల్, మమత, పీడీఎస్యూ నాయకులు పాల్గొన్నారు.

వరిపంటల పరిశీలన

నవీపేట,సెప్టెంబరు 19: మండలంలోని రాంపూర్లో వరిపంటలను గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి నవీన్ కుమార్ పరిశీలించారు. వరిపంటకు సోకిన బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు నివారణకు రైతులకు తగిన సలహాలు, సూచనలు అందజేశారు. తెగుళ్లు సోకిన పంట నుంచి ఇతర పొలాలకు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినోద్, ప్రసన్న కుమార్, రవి కిరణ్ తదితరులున్నారు.

23న వాహనాల వేలం

ఆర్మూర్రూరల్,సెప్టెంబరు19: ఆర్మూర్ పట్టణంలోని ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబ డిన మూడు వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 23న వేలం వేయనున్నట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్సన్ తెలి పారు. ఆసక్తి ఉన్న వారు 23న ఉదయం 11గంటలకు వేలం పాటలో పాల్గొనాలని కోరారు. ఇందుకు 25శాతం డిపాజిట్ జమ చేయాల్సి ఉంటుందన్నారు.

ఆరోగ్యశ్రీ సిబ్బంది సమ్మెబాట

● ధర్నాచౌక్ వద్ద నిరసన వ్యక్తం చేసిన ఆరోగ్యశ్రీ సిబ్బంది

పెద్దబజార్, సెప్టెంబరు 19: ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఆరోగ్యశ్రీ సిబ్బంది సమ్మెబాట పట్టారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద ఆరోగ్యశ్రీ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సమ్మెను సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనాల పెంపుదల కోసం ఆరోగ్య మిత్రలు గురువారం నుంచి సమ్మెను ప్రారంభించారని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న వేతనాలు పెంచడం లేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆగస్టు 6వ తేదీన సమ్మె నోటీసు ఇచ్చారని గత 45 రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెబాట పట్టామన్నారు. ఇప్పటికైనా వారితో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాగౌడ్, శ్రావణ్, విజయ్, అంబిక, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం

ఆర్మూర్టౌన్, సెప్టెంబరు19: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీత, లెక్చరర్లు ఎస్.జాన్ సుకుమార్, అంబర్సింగ్, జి.లింగన్న, తదిత రులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన

ముప్కాల్, సెప్టెంబరు19: బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో తెలంగాణ విపత్తు స్పందన, బాల్కొండ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఫైర్ సెఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైన విపత్తు జరిగితే తల్లిదండ్రులు 101కు సమాచారం అందించాలని, బాల్కొండ అగ్నిమాపక ఫైర్స్టేషన్ అధికారి బి.శేఖర్ సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థిని విద్యార్థులకు ఫైర్ సేఫ్టిపై అవగాహన కల్పిస్తూ ఏదైనా విపత్తు సమయంలో తమ సిబ్బంది ఎలా ముందుకు వెళ్తారో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్కర్తన్, పాఠశాల పర్యవేక్షకులు బి.రాజేందర్, అగ్నిమాపక సిబ్బంది రాములు, హనుమాన్చారి, కె.ఆశిష్, పి.వినిత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రోడ్డు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



భీమ్గల్లో కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

భీమ్గల్, సెప్టెంబరు19: పట్టణ కేంద్రంలోని 10వార్డులో రోడ్డును కబ్జా చేసి గోడ నిర్మించి చర్చి నడిపిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని చర్చిని తొలగించాలని కాలనీవాసులు గురువారం మున్సిపల్ కమి షనర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు.కాలనీకి గల రోడ్డును కబ్జా చేసి అక్రమంగా గోడను నిర్మించి కాలనీవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయమై గతంలో కూడా ఫిర్యాదు చేశామని, తక్షణమే రోడ్డు కబ్జా చేసిన పాస్టర్ ఇజ్రాయిల్పై చర్యలు తీసుకొని చర్చిని తొలగించాలని కాలనీవాసులు కోరారు.



కామారెడ్డిలో బోరు మోటారును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోరు మోటారు ప్రారంభం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 19: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి బోరు మోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో తీవ్ర నీటి సమస్య ఉందని స్థానిక కౌన్సిలర్ తమ దృష్టికి తీసుకురావడంతో ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు బోరుమోటారును ప్రారంభించామని తెలిపారు. అదేవిధంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పడిగె సుగుణ, పాత శివకృష్ణమూర్తి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎన్‌డీసీసీబీ మేనేజర్ శృతివాణి

దోమకొండ, సెప్టెంబరు 19: ది నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (రాష్ట ప్రభుత్వ భాగస్వామిక బ్యాంకు)అందిస్తున్న సేవలను రైతులు, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దోమకొండ ఎన్‌డీసీసీబీ మేనేజర్ శృతివాణి గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్షకమిత్ర పేరుతో బ్యాంకు నుంచి నేరుగా ల్యాండ్ మార్టిగేజ్ రుణ సదుపాయం ఎకరాకు రూ.2లక్షలు, అత్యధికంగా రూ. 10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎడ్యుకేషన్ లోన్‌లో విద్యార్థులకు రూ. 20లక్షల వరకు విదేశీ విద్యకు, రూ. 10 లక్షల వరకు స్వదేశీ విద్యకు రుణం ఇవ్వనున్నామన్నారు. బంగారు అభరణాలపై అత్యధికంగా రూ. 20 లక్షల వరకు రుణం, గృహ రుణం పట్టణ ప్రాంతాల్లో రూ. 40 లక్షలు, మండల ప్రాంతాల్లో రూ. 30 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 25 లక్షలు, డిపాజిట్లపై రూ. 5 లక్షల వరకు డిపాజిట్ ఇన్సూరెన్స్ ఈ ఐసీజీసీ, శతాబ్ది నూతన డిపాజిట్ పథకం, లాకర్ల సదుపాయం ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

వాచ్‌మెన్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు

భిక్కనూరు, సెప్టెంబరు 19: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలోని ఓ గెస్ట్‌హౌస్ వద్ద వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడ్డ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన రాజేష్ తన భార్యతో కొన్ని రోజులుగా పెద్దమల్లారెడ్డి శివారులోని గెస్ట్‌హౌస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గత మంగళవారం సాయంత్రం గెస్ట్‌హౌస్ గేటు ముందు గ్రామానికి చెందిన కొండల్‌రెడ్డి, మరి కొంతమంది కారు అడ్డుగా పెట్టారు. కారు తీయని చెప్పినందుకు కోపోద్రిక్తులై దంపతులపై రాళ్ళు, కర్రలతో దాడి చేశారని తెలిపారు. బాధితుల కథనం ప్రకారం కొండల్ రెడ్డితో పాటుగా దాడిలో పాల్గొన్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

కామారెడ్డిలో కాంగ్రెస్ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 19: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తర్వీందర్‌సింగ్, రణవీర్,రఘురాజ్‌సింగ్, కంగనారనౌత్‌లపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మహేష్, శ్రీనివాస్, యూనిస్, స్వామి, రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

రామారెడ్డి, సెప్టెంబరు 19: మండల కేంద్రానికి చెందిన బుచ్చయ్య(60) అనే వ్యక్తి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సురేష్‌గౌడ్ తెలిపారు. గత కొన్నిరోజుల క్రితం మురికికాలువలో పడి తీవ్ర గాయాలపాలై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో అస్వస్థతకు గురవుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి ఆసుపత్రికి తరలించామని మృతిచెందిన బుచ్చయ్య భార్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాత బాన్సువాడలో గణేష్ నిమజ్జనం

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 19: పాత బాన్సువాడలో గణేష్ నిమజ్జనం గురువారం ఉదయం ముగిసింది. మండపాల నిర్వాహకులు బుధవారం రాత్రి నుంచి వినాయక ప్రతిమలను శోభయాత్ర నిర్వహించారు. గురువారం ఉదయం స్థానిక కల్కి చెరువులో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ శ్రీహరి రాజు దగ్గరుండి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లను చేశారు. బాన్సువాడ పట్టణంలో నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకరించిన మండపాల నిర్వాహకులకు, ప్రజలకు మున్సిపల్ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

కులంపేరుతో అవమాన పరిచిన వారిపై

చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలి: ఎమ్మార్పీఎస్



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, బాధితులు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 19: కులాంతర వివాహం చేసుకున్న దంపతులు అంత్యక్రియలకు హాజరైతే సాంఘిక బహిష్కరణ చేసి కులంపేరుతో అవమాన పరిచిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధూశర్మకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాగయ్య మాట్లాడుతూ తాడ్వాయి గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ కులానికి చెందిన ఎరుకట్ల అక్షయ అదే గ్రామానికి చెందిన బీసీ కుర్మ కులానికి చెందిన బీర్ల అనిల్ ఐదునెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారని తెలిపారు. గత నెలలో అనిల్ మేన మామ బీర్ల రాజయ్య చనిపోతే అంత్యక్రియలకు వెళ్లినందుకు మాదిగ కులానికి చెందిన అమ్మాయిని చేసుకున్నావుగా నీవు కుడా మాదిగ వాడివయ్యావని మీరు ఉంటే అంత్యక్రియలు చేయమని చెప్పడంతో వెంటనే అక్కడి నుండి తిరిగివచ్చారని తెలిపారు. దీనిపై తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో ఎస్సైకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసు స్టేషన్‌కు వెళ్తే ఎస్సై అవమానించి మాట్లాడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా కుర్మ కులస్థులు అనిల్ వారి అమ్మానాన్నతో కుర్మ కులస్థులతో మాట్లాడినా కూడా రూ.5లక్షల జరిమానా విధిస్తామని పేర్కొంటున్నారని తెలిపారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసు కోవాలని ఎస్పీకి కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు అక్షయ, అనిల్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాయన్న, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ నాగభూషణం, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు రాజన్న, ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రమంలో ఎమ్మెల్యేకు

యువ నాయకుల స్వాగతం



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న యువ నాయకులు

మద్నూర్, సెప్టెంబరు 19 : జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు విదేశీ పర్యటనలో ముగించుకుని నేరుగా విమానాశ్రయం నుంచి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా ఉమ్మడి మద్నూర్ మండలంలోని యువకులు, హైదరాబాద్ విమానాశ్ర మానికి వెళ్లి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. విదేశాలలో జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధిపై ఇక్కడి విషయాలపై ప్రజలకు, శాస్త్రవేత్తలకు వివరించి చెప్పిన తోట లక్ష్మీకాంతారావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేరుకోగానే నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

రోడ్డును బాగు చేయించిన యువకుడు



అధ్వాన్నంగా గోజేగాం రోడ్డు | మొరం వేయించిన యువకుడు

మద్నూర్, సెప్టెంబరు 19 : ఉమ్మడి మద్నూర్ మండలంలోని మారుమూల గోజేగావ్ గ్రామానికి రోడ్డు అధ్వానంగా మారగా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ గ్రామానికి చెందిన యువకుడు ముందుకు వచ్చి 25 ట్రాక్టర్లతో మొరం వేయించారు. మద్నూర్ మండలం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆదివాసీలు అధికంగా నివసించే గోజేగావ్ గ్రామానికి గతంలో తారు రోడ్డు వేశారు. ఇటీవల వర్షానికి రోడ్డు అధ్వానంగా మారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని అధికారులకు విన్నవించినప్పటికీ వారు పట్టించుకోక పోవడంతో అదే గ్రామానికి చెందిన సంతోష్ పటేల్ అనే యువకుడు ముందుకు వచ్చి ప్రజల సౌకర్యార్థం గుంతలు పడ్డ రోడ్డుపై మొరం వేయించారు. దీంతో గ్రామస్తులు గ్రామ యువకున్ని అభినందించారు. ఆదివాసులు అత్యధికులుగా నివసిస్తున్న మా గ్రామాన్ని పట్టించుకునే వారు లేరని ప్రజలు వాపోతున్నారు.

ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన ర్యాలీ



లింగంపేటలో ర్యాలీ తీస్తున్న ముస్లింలు

లింగంపేట, సెప్టెంబర్ 19: మండల కేంద్రంలో గురువారం మహ్మద్ ప్రవక్త జన్మదిన ర్యాలీని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈనెల 16న మహ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్(ఉన్)నబీని జరుపుకున్నప్పటికి వినాయక నిమజ్జనం కారణంగా ర్యాలీలు తీయలేకపోయారు. దాంతో బుధవారం ర్యాలీలు తీసి మజీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త బోధించిన బోధనలను వినిపించి వాటిని ప్రతీ ముస్లిం పాటించాలని మత పెద్దలు సూచించారు. కార్యక్రమంలో మత పెద్దలు అబ్దుల్ ఖదీర్, ఫారూఖ్, వాహబ్, ఫతీయోద్దీన్, ఇబ్రహీం, రఫీఖ్, ఖుద్దూస్‌లతో పాటు మత పెద్దలు ఉన్నారు.

మండల కేంద్రానికి రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభం అయిన దృశ్యం

మద్నూర్, సెప్టెంబరు 19 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జాతీయ రహదారి బైపాస్ నుంచి మండల కేంద్రానికి గతంలో రోడ్డు పనులు ప్రారంభించారు. అర్థాంతరంగా పనులు నిలిచిపోవడంతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక శ్రద తీసుకుని రోడ్డు పనులు ప్రారంభించారు. జాతీయ రహదారి బైపాస్ నుంచి మండల కేంద్రానికి వచ్చే సర్వీస్ రోడ్డు అధ్వాన్నంగా మారడంతో ప్రజలు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అప్పట్లోనే రోడ్డు మరమ్మతులకు నిధులను మంజూరు చేయించారు. అప్పట్లో పనులు చేస్తుండగా అర్థాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డు మరింత అధ్వాన్నం కావడం వల్ల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే రోడ్డు పనులను గురువారం నుంచి పునః ప్రారంభించారు. రోడ్డు పనులు పునః ప్రారంభం కావడంతో మండల కేంద్రం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

నిజాంసాగర్, సెప్టెంబరు 19: నిజాంసాగర్ ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటర్ నెంబర్-7 వద్ద నిజాంసాగర్ పోలీసులు గుర్తు తెలియని మహిళా మృతదేహాన్ని గుర్తించారు. గుర్తు తెలియని మహిళ (55) ఉంటుందని ఎస్సై సుధాకర్ తెలిపారు. నీలిరంగు చీర, పసుపు రంగు జాకెట్టు, పెట్టికోట్ ఉందని తెలిపారు. బాన్సువాడ గ్రామీణ ఇన్‌స్పెక్టర్‌కు గాని, నిజాంసాగర్ ఎస్ఐకి గాని సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్సై నిజాంసాగర్ నెంబర్ 87126 86172, బాన్సువాడ సీఐ నెంబర్ 87126 86170కు సంప్రదించాలన్నారు.

21లోగా ఓటరు లిస్టులో మార్పులు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సయ్యద్ సాజిద్ అలీ



దోమకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

తాడ్వాయి, సెప్టెంబరు 19: ఓటరు లిస్టులో వార్డుల మార్పులు చేర్పులకు ఈ నెల 21లోగా సమర్పించాలని మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సమావేశానికి పలు రాజకీయ పార్టీల నాయకులను పిలిచి ఓటరు లిస్టులో వార్డుల మార్పుకు అలాగే పేరు నమోదుకు తప్పొప్పుల సవరణను ఈ నెల 21లోగా పూర్తి చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, బాపురెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పులగం సాయిరెడ్డి, ముదాం నర్సింలు, ఎంపీఓ సవితరెడ్డి, హనుమాన్లు, పలు రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: గ్రామ పంచాయతీ ఓటరు ముసాయిదా ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు ఉన్న వాటి అభ్యంతరాలను 21 లోగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఏవైనా అభ్యంతరాలు ఉంటే గుర్తించి గ్రామ పంచాయతీలో సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు కానుగంటి నాగరాజు, బుర్రి రవి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 13న ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాలపై ఈ నెల 21 వరకు అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు సమర్పించవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్ తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ముసాయిదా జాబితాలను స్థానిక గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ఈ నెల 13న ముసాయిదా జాబితా ప్రకటించామని, ఆ జాబితాలపై అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే ఈ నెల 21 లోగా సంబంధిత పంచాయతీ కార్య దర్శులకు అందజేయాలని తెలిపారు. ఆ అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 26లోగా పరిష్కరించనున్నాని తెలిపారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల రాజకీయ నాయకులు విఠల్, అరిగే సాయిలు, సున్నం సాయిలు, రాము, సక్కు, మేకల రాములు పాల్గొన్నారు.

దోమకొండ ప్రభుత్వ కళాశాల ఆవరణలో శ్రమదానం



దోమకొండ కళాశాల ఆవరణలో శ్రమదానం చేస్తున్న అధికారులు

దోమకొండ, సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల ఆవరణలో తరగతి గదుల చుట్టూ చెట్లు ఏపుగా పెరగడం వల్ల పాములు వస్తున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తమ దృష్టికి తీసుకువచ్చారని దీంతో ముందుగా పంచాయతీ సిబ్బందితో కలసి పిచ్చి మొక్కలను తొలగించడం జరిగిందన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని అందుకు ప్రతీఒక్కరు విధిగా చెత్తను బయట వేయకుండా చెత్త బుట్టలో వేయలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, ఏపీవో రజిని, సీనియర్ అసిస్టెంట్ మాణిక్యరావు, బాబాయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, టీఏ రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సీతారాం మధు, మాజీ సర్పంచ్ అంజలి, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ లింగం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 19: గత అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ ఎలాంటి షరతు లేకుండా రైతులందరికీ అందజేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన ప్రజాభవన్ ముట్టడి కోసం బయలుదేరేందుకు సిద్ధమవుతున్న పట్టణ బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. అరెస్ట్ అయినవారిలో నాయకులు భూంరెడ్డి, లక్ష్మీనారాయణ, నరేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నసురుల్లాబాద్: చలో ప్రగతి భవన్ ముట్టడి సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులను బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో గుడిసెల నర్సింలు గౌడ్, టేకుర్ల సా యిలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రామారెడ్డి: రైతు ఉద్యమాలను ఎవరు ఆపలేరని జిల్లా రైతు డైరెక్టర్ కాసర్ల రాజేందర్ హెచ్చరించారు. గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి సరిగ్గా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని రైతులకు తగిన న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందని తెలిపారు.

గాంధారి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీ ఎలాంటి షరతు లేకుండా అమలు చేయాలని ప్రజాభవన్ ముట్టడికి బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు మండల బీఆర్‌ఎస్ నాయకులు బయలుదేరారు. దీంతో గాంధారి ఎస్సై ఆంజనేయులు వారిని ముందస్తు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అధికారం అడ్డం పెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో రెడ్డిరాజులు, మాజీ మండల అధ్యక్షుడు సురేష్, కోఆప్షన్ మెంబర్ ముస్తఫా, పట్టణ అధ్యక్షుడు సంతోష్, శ్యాం తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి

ప్రతీ ఒక్కరు కృషిచేయాలి

రామారెడ్డి, సెప్టెంబరు 19: బీజేపీ పార్టీ బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్రకార్యదర్శి ఆనందరావు తెలిపారు. రామారెడ్డి మండలం మద్దికుంట,స్కూల్ తండా గ్రామాలలో గురువారం కిసాన్ సంఘ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పార్టీ అయిన బీజేపీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సాయిరెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్, ఉపాధ్యాక్షుడు బాలయ్య, శివయ్య ,లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు చదువులో రాణించాలి'

సదాశివనగర్, సెప్టెంబరు 19: విద్యార్థులు చదువులో రాణించాలంటే తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని మండల విద్యాశాఖాధికారి యోసప్ తెలిపారు. ధర్మారావుపేట ఉన్నత పాఠశాల పరిధిలోని అమర్లబండలో విద్యార్థుల తల్లిదండ్రులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పాఠశాల నుండి విద్యార్థులు ఇంటికి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులు ఎంతవరకు బోధించారని, ఇచ్చిన హోంవర్క్‌ను పూర్తిచేసే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని తెలిపారు. విద్యా ర్థులపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలని అప్పుడే విద్యార్థి మంచి ఉన్నత స్థానానికి చేరుకుంటాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, కృష్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట్ జీపీని తనిఖీ చేసిన డీపీవో




జీపీ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్‌రావు తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటారు జాబితాను, అభ్యంతరాలను పరిశీలించారు. అనంతరం ఆయన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులతో చర్చించారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్‌చారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య పాల్గొన్నారు.

కళాశాలకు కుర్చీల వితరణ

దోమకొండ, సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలకు గురువారం అదే కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న నర్సింహరాజు వారి తల్లి చంద్రభాగవ్వ జ్ఞాపకార్థం 12 కుర్చీలను వితరణ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్‌లు శేషారావు, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి




కామారెడ్డి

శాంతి - సరిపోదా శనివారం
దర్శన్ - ఏఆర్ఎమ్
ప్రియా 35 - మత్తు వదలరా-2

బాన్సువాడ

మహేశ్వరి - మత్తు వదలరా 2
వెంకటేశ్వర - శంకర్‌దాదా ఎంబీబీఎస్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

